శ్రీ దత్త ఫ్యాషన్స్ వారి

# శ్రీ వారాహి సిల్క్స్

కంచిపట్టు నిలయం

## 100 DAYS CELEBRATION

మార్చి 18,19, 20

ప్రతి కొనుగోలుపై ప్రత్యేకమైన

"ఉచిత బహుమతులు"

. ప్రారంభించిన నాటి నుండి మమ్మలి ఆదరించిన కష్ట మర్ల దేవుళ్ళు అందరికి మా ధన్యవాదములు.

. మీ అందరి ఆధారాభిమానులతో 100 రోజులు పూర్తి చేసుకున్న శుభ సందర్భముగా మీ "వారాహి సిల్క్స్" వారి 100 రోజుల సెలబ్రెషన్స్ " వేడుకులు జరుపుకొంటున్న సందర్భంగా.

. మార్చి 18, 19, 20 తేదీలు. ఈ మూడు రోజులు షాపింగ్ చేసిన ప్రతి కొనుగోలుపై ఉచిత 'బహుమతులు" అందుకోబడుతుంది.



శ్రీ దత్త ఫ్యాషన్స్ వారి

శ్రీ వారాహి సిల్క్స్

### కంచి వీవర్స్ కలక్షన్స్

1. కంచి పట్టు
2. ధర్మవరం
3. ఉప్పాడ
4. ఆరణి
5. గద్వాల్
6. బ్రైడల్స్ శారిస
7. కంచి కనక ధార పట్టు
8. కంచి తులసి పట్టు
9. పరిణయ పట్టు

# OUR FIRST 100 DAYS.

## Contact Us: 96668 89459

Near Krishna Park, Palakonda Road.Srikakulam - 532001,Andhra Pradesh

High Fancy Sarees ! Designer Sarees ! Ethnic Wear! Kanchi ! Aaraani ! Gandharva pattu!

follow us on :Face book instagram whatsapp

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 19-3-2025
సంపుటి: 20 సంచిక: 302
పేజీలు: 8 వెల: రూ.1



## చిన్న శ్రీను కుమారుడు మృతి

(సత్యంన్యూస్, విజయనగరం)

విజయనగరం జిల్లాపరిషత్ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త, విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు రెండో కుమారుడు ప్రణీత్ బుధవారం మృతిచెందాడు. 2020 మే 14న ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రణీత్ సుమారు ఐదేళ్లు మృత్యువుతో పోరాడాడు. నాలుగు సంవత్సరాల 10 నెలల పాటు మృత్యువుతో పోరాడి చివరకు విశాఖపట్నంలోని స్టార్ పినాకిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచాడు.



### డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో

# జీవితాలను మార్చే మాలిక్యూల్ చోరీ









- ❖సుమారు రూ.8 కోట్లు విలువ చేసే పౌడర్ మాయం
- ❖ఇంటిదొంగల కోసం గుంబనంగా వెతుకుతున్న యంత్రాంగం
- ❖గత పది రోజులుగా లభించని ఆచూకీ

టైప్-2 మధుమేహం ఉన్నవారి జీవితాలను మార్చే అత్యంత అరుదైన మాలిక్యూల్‌ను పైడిభీమవరంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పది రోజుల క్రితం దొంగిలించారు. దీనిపై డ్రగ్ అథారిటీస్‌కు రెడ్డీస్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో ఓవైపు పోలీసులు, మరోవైపు రెవెన్యూ యంత్రాంగం తీవ్రంగా వెతుకుతున్నారు. కానీ దేశంలో మొదటిసారి ఇటువంటి మాలిక్యూల్‌ను కనిపెట్టిన రెడ్డీస్ నుంచి ఈ పౌడర్ మాయమైందంటే.. దీనివెనుక కచ్చితంగా జాతీయ లేదా అంతర్జాతీయ కుట్ర ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెడ్డీస్ ల్యాబ్ నుంచి ఈ మాలిక్యూల్‌ను దొంగిలించిన వ్యక్తికి ఇది ఎంత విలువైనదో తెలియకపోవచ్చని, కేవలం డబ్బు కోసం, వేరేవారికి లబ్ధి చేకూర్చడం కోసం ఈ పని చేసుంటారని భావిస్తున్నారు. స్థానిక పోలీసులు పది రోజులుగా వెతుకుతున్నా దీని జాడ కనిపెట్టలేకపోతున్నారు. కారణం.. రూ.8 కోట్లు విలువ చేసే ఈ మాలిక్యూల్ మనకు మార్కెట్‌లో దొరికే ఖైనీ ప్యాకెట్ సైజులో ఉంటుంది. ఇప్పటికే ఇది రాష్ట్రం, లేదా దేశం దాటేసివుంటుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. వివరాల్లోకి వెళితే..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో టైప్-2 మధుమేహం ఉన్నవారికి సెమాగ్లుడైట్ ఇంజక్షన్ లేదా మాత్రలు అందుబాటులో ఉన్నాయి. అయితే దాన్ని భారతదేశంలో డెవలప్ చేయాలని అనేక ఫార్మా కంపెనీలు ప్రయత్నించి విఫలమయ్యాయి. రెడ్డీస్ ల్యాబ్‌లో ఉన్న అధునాతన పరిజ్ఞానం, టెక్నాలజీ వల్ల ఈ బయోసిమిలర్ మెడిసిన్‌లో ప్రయోగాన్ని విజయవంతం చేశారు. ఈ మందు మార్కెట్‌లో అందుబాటులోకి వస్తే మధుమేహం వల్ల దెబ్బతిన్న గ్రంధులు, టిష్యూస్‌ను రిపేర్ చేసే అవకాశం ఉంటుంది. ఇంతవరకు మార్కెట్ లో ఉన్న మధుమేహపు మందులు ఒంట్లో షుగర్ లెవెల్స్‌ను తగ్గించడానికి మినహా, దీని వల్ల పాడైన టిష్యూలను, బలహీనపడిన గుండె, కిడ్నీ వంటి ఆర్గాన్స్‌ను మెరుగుపర్చడానికి ఉపయోగపడవు. కానీ ఇప్పుడు రెడ్డీస్ తయారుచేసిన ఈ మాలిక్యూల్ పెప్టైడ్ తరహాకు చెందినది. ఇది ప్రస్తుతం పౌడర్ రూపంలో ఉంది.

నిండా ఖైనీ ప్యాకెట్ పరిమాణంలో ఉన్న ఈ పౌడర్ మార్కెట్‌లో దాదాపు రూ.8 కోట్లు విలువ చేస్తుంది. అంతకు మించి ఇది టాబ్లెట్, లేదా ఇంజక్షన్ రూపంలో ఎంతోమందికి ఉపయోగపడుతుంది. డాక్టర్ రెడ్డీస్ సొంత ఫార్ములా తయారుచేయడం కోసం కొన్ని కోట్లు వెచ్చించింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య దీన్ని ఉంచినా దొంగిలించగలిగారంటే.. కచ్చితంగా ఇది ఇంటిదొంగ పనేనన్న అనుమానాలున్నాయి. దీన్ని దాచిన లాకర్‌కు బయోమెట్రిక్, సీసీ కెమెరాలు, డబుల్ ఎండ్ లాక్ ఉన్నప్పటికీ ఈ ఫార్ములా మిస్ అయిందంటే కచ్చితంగా దీనిలో పెద్దస్థాయి కుట్రే ఉందన్న అనుమానాలున్నాయి. ప్రైవేటుగా దేశంలో అనేక ల్యాబ్‌లు నడుస్తున్నాయి. రెడ్డీస్ లాంటి సంస్థలతో పాటు అనేక ఫార్మా కంపెనీలు తయారుచేసిన ఫార్ములాను టాబ్లెట్ గానో, ఇంజక్షన్ సీసాల్లోనో నింపి ఇవ్వడానికి ఇవి పని చేస్తుంటాయి. ఇప్పుడు ఈ ఫార్ములాకు సంబంధించిన మొత్తం రికార్డును తానే తయారు చేశానని, ఈ పెప్టైడ్ మాలిక్యూల్‌లో ఏది ఎంత కలిపితే మెడిసిన్ అవుతుందో తెలిసిన వ్యక్తే దీన్ని బయటకు దాటించివుంటారని భావిస్తున్నారు. గత కొద్ది రోజులుగా రణస్థలం పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ఈ పని మీదే బిజీగా ఉంది. పది రోజులైనా ఈ ఫార్ములా పౌడర్‌ను పట్టుకోలేదంటే అది కచ్చితంగా ఏదో ఒక సరిహద్దు దాటిపోయిందని భావించాల్సివుంది.







### హమ్మయ్యా..

# సునీతా రిటర్న్స్!

- ☼అనూహ్యంగా అంతరిక్షంలో 286 రోజులు
- ☼కొత్త రికార్డు నమోదు చేసిన ఇద్దరు ఆస్ట్రోనాట్లు
- ☼భూవాతావరణానికి అలవాటు పడటానికి కొన్ని రోజులు
- ☼అంతవరకు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలోనే..

డి.వి.రమణ, సీనియర్ జర్నలిస్ట్

వ్యోమనౌక డ్రాగన్ క్రూ 9ని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి అన్‌డాకింగ్ చేసే ప్రక్రియ మంగళవారం ఉదయం ప్రారంభమైంది. అక్కడి నుంచి ప్రయాణం ప్రారంభించిన క్రూ 9 సుమారు 17 గంటల ప్రయాణించి భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2.41 గంటలకు భూ వాతావరణంలోకి ప్రవేశించింది. కొద్దిసేపటికే అంటే తెల్లవారుజామున 3.27 గంటలకు వ్యోమనౌక ఫ్లోరిడా తీరంలో సముద్రంలో ల్యాండ్ అయ్యింది.

దాంతో తొమ్మిది నెలలుగా నాసాతో సహా ప్రపంచ అంతరిక్ష పరిశోధకులను కలవరపెట్టిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ల ఉదంతం సుఖాంతమైనట్లే. అయితే అక్కడితో కథ ముగిసిపోలేదు. ఒక కీలక ఘట్టం ముగిసిందంతే!. మరో కీలక ఘట్టానికి తెర లేచింది. ఎందుకంటే నిర్ణీత కాలానికి మించి తొమ్మిది నెలల (286 రోజులు) పాటు అంతరిక్ష కేంద్రంలో ఉండిపోయిన అస్ట్రోనాట్లు ఇద్దరు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. భూ వాతావరణానికి తిరిగి అలవాటు పడటం అంత సులభం కాదు. అందుకే భూమికి చేరినవెంటనే వారిద్దరినీ నేరుగా నాసాకు చెందిన జాన్సన్ స్పేస్ సెంటర్‌లోని వైద్యకేంద్రానికి తరలించారు. సుమారు 45 రోజుల పాటు వారిని వైద్యులు, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉంచి తగిన చికిత్స అందిస్తారు.

### 8 రోజులనుకుంటే 9 నెలలు

అంతరిక్ష పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా)కు చెందిన వ్యోమగాములైనా భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు గత ఏడాది జూన్ ఐదో తేదీన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్షకేంద్రానికి వెళ్లారు. వారు అక్కడ ఎనిమిది రోజులు ఉండి పరిశోధనల అనంతరం తిరిగి వచ్చేలా నాసా ప్రణాళిక రూపొందించింది. కానీ స్టార్‌లైనర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ ప్రణాళికకు గండి కొట్టాయి. ఫలితంగా సునీత, విల్మోర్‌లో లేకుండానే స్టార్‌లైనర్ ఖాళీగానే భూమి పైకి వచ్చేసింది. అప్పటినుంచి వారిద్దరిని భూమికి తీసుకొచ్చేందుకు నాసా శాస్త్రవేత్తలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. చివరికి ఎలన్ మస్క్‌కు చెందిన డ్రాగన్ క్రూ 9 స్పేస్ క్యాప్సూల్‌ను అంతరిక్షంలోకి పంపించి ఎట్టకేలకు ఇద్దరు అస్ట్రోనాట్లను భూమిపైకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో అంతరిక్ష కేంద్రంలో ఎక్కువ రోజులు గడిన రికార్డును సునీత, విల్మోర్‌లు నమోదు చేశారు. గతంలో ఫ్రాంట్ రూబియో 371 రోజులు అంతరిక్ష కేంద్రంలో గడిపిన రికార్డు సృష్టించగా.. తాజా ఆ రికార్డును ఛేదించి సునీత, విల్మోర్‌లు 386 రోజులు గడిపి కొత్త రికార్డు సృష్టించారు. ఈ - మిగతా చివరి పేజీలో

# గోవిందుడు అందరివాడేలే!

- ⏭ రాష్ట్ర కళింగకోమటి సంఘ అధ్యక్షుడిగా బోయినే ఉండాలని తీర్మానం
- ⏭ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కోటబొమ్మాళి వెళ్లి కిరీటం పెట్టిన కళింగకోమట్లు
- ⏭ కళింగవైశ్య భవనంలో సమావేశమైన పెద్దలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళింగకోమటి జిల్లా సంఘానికి, నగర సంఘానికి మధ్య ఇటీవల తలెత్తిన కొన్ని అభిప్రాయభేదాల వల్ల మనస్తాపం చెంది రాష్ట్ర కళింగ కోమటి సంక్షేమ సంఘ అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు ఆ పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. అయితే వారం గడవక ముందే బోయిన గోవిందరాజులు మినహా రాష్ట్ర సంఘ బాధ్యతలు మోసే దిక్కు లేదంటూ కళింగకోమటి నేతలు ఆయన ఇంటికి వెళ్లి కోటబొమ్మాళిలో బుధవారం ఆయన వివాహ వార్షికోత్సవ వేడుకలు జరిపి ఆయనే మళ్లీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండాలంటూ ఏకవాక్య తీర్మాణం చేశారు. అంతకు ముందు నగరంలో కళింగవైశ్య కళ్యాణ మండపంలో ముందుగా నగర కమిటీ సభ్యులు సమావేశమై గోవిందరాజులు సేవలు ప్రస్తుత తరుణంలో ఎందుకు అవసరమో నొక్కివక్కాణించారు. కొద్ది రోజుల్లో కేంద్ర సామాజిక న్యాయశాఖా మంత్రితో పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లాలో ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన కులాలపై సమావేశం కానున్న నేపథ్యంలో ఢిల్లీలో కళింగకోమట్ల తరపున ప్రాతినిధ్యం వహించడానికి బోయిన గోవిందరాజులు లాంటి సీనియర్లు అవసరమని వీరంతా పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో గోవిందరాజులు రాజీనామాను ఆమోదించడం, ఆ స్థానంలో వేరేవారిని నియమిస్తే కోమట్లు నష్టపోతారని, సంఘం అన్నాక చిన్నచిన్న మనస్పర్థలు వస్తాయని, వాటిని సర్దుబాటు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీరు పేర్కొన్నారు. టౌన్ కమిటీ సమావేశం అనంతరం జిల్లా కమిటీ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. వీరంతా కోటబొమ్మాళి వెళ్లి ఆయనే మళ్లీ పగ్గాలు చేపట్టాలని కోరడంతో గోవిందరాజులు సమ్మతించారు. కొద్ది రోజుల క్రితం నగర కమిటీకి, జిల్లా కమిటీ సభ్యులకు మధ్య సోషల్‌మీడియా వేదికగా మాటల యుద్ధం జరిగింది. ఆమధ్య కోరాడ హరిగోపాల్ వాణిజ్య విభాగం సమావేశం పెట్టినప్పుడు కోమట్ల సంఘంలో ఉన్న చాలామందిని ఆహ్వానించారు గానీ, రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులును మాత్రం పిలవలేదనే నినాదం వాట్సాప్ గ్రూపుల్లో యుద్ధానికి దారితీసింది. ఇందులో గోవిందరాజులు తరపున కొందరు, హరిగోపాల్ తరపున మరికొందరు మాటల యుద్ధం కొనసాగించడంతో మనస్తాపం చెందిన గోవిందరాజులు తన పదవికి రాజీనామా చేస్తూ పార్టీ ఇచ్చిన బీసీ సాధికార కమిటీ కన్వీనర్‌గా మాత్రం కొనసాగుతానని తప్పుకున్నారు. అప్పట్నుంచీ కళింగకోమటి సంఘంలో అంతర్మథనం మొదలైంది. అందరివాడిగా గుర్తింపు పొందిన గోవిందరాజులు తెలుగుదేశం పార్టీకి బాగా కావాల్సిన వ్యక్తి కాబట్టి ఇప్పుడు ఆ పార్టీ అధికారంలో ఉన్నందున ఓబీసీ సాధన కోసం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో లాబీయింగ్ చేయడానికి ఆయన అనుభవం పనికొస్తుందని పలువురు అభిప్రాయపడటంతో గోవిందరాజులును మళ్లీ ఈ పీఠం మీద కూర్చోబెట్టడానికి వీరంతా కోటబొమ్మాళి వెళ్లారు. మరోవైపు తాను నిర్వహించిన కార్యక్రమానికి గోవిందరాజుల్ని కూడా ఆహ్వానించానని కోరాడ హరిగోపాల్ చెబుతున్నారు. ఏదిమైనా టీకప్పులో రేగిన తుపాను వెలిసిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



• ఎడిటోరియల్

# అటకెక్కిన అభ్యంతరాలు

ఎలెన్‌మస్క్‌కు చెందిన శాటిలైట్ ఆధారిత స్టార్‌లింక్‌కు దేశంలో ఇంటర్నెట్ సేవలందించే అవకాశం కల్పిస్తే పౌరుల, దేశ డేటా మొత్తం అమెరికాకు వెళ్లిపోతుందని ఇన్నాళ్లూ గగ్గోలుపెట్టిన ఇండియన్ టెలీకం చక్రవర్తులు ఇప్పుడు అదే ఎలెన్‌మస్క్‌తో కలిసి వ్యాపారం చేయడానికి ఇండియాలో స్టార్ ఎక్స్‌ను ఎంచుకోవడం వెనుక మతలబేమిటి? ఇవి రోదసిపై గుత్తాధిపత్యానికి దారితీయనున్నాయా? అదే జరిగితే జాతీయ భద్రత, దేశ సార్వభౌమాధికారాల మాటేమిటి? స్టార్‌లింక్‌తో జియో, ఎయిర్‌టెల్‌ల ఒప్పందాలు లేవనెత్తుతున్న ప్రశ్నలివి. ఇది ట్రంప్, ఆయన భారతీయ చెలికాడు మోదీ తెరవెనుక నడిపిన మంత్రాంగమనీ, ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకు స్టార్ లింక్ యజమాని ఎలన్‌మస్క్ ద్వారా ప్రధాని మోదీయే స్వయంగా ఈ భాగస్వామ్యాలను ఏర్పాటు చేశారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. స్టార్‌లింక్ అనేది అమెరికన్ ఏరోస్పేస్ కంపెనీ 'స్పేస్‌ఎక్స్' అభివద్ధి చేసిన ఇంటర్నెట్ సేవలను అందించే ఉపగ్రహ ఆధారిత అంతర్జాల వ్యవస్థ. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలన్‌మస్క్‌కు చెందిన ఈ సంస్థ భారత్‌లో తన ఇంటర్నెట్ సేవలను విస్తరించడానికి గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. కాగా భారత కుబేరులైన ముఖేశ్ అంబానీకి చెందిన జియో, సునీల్ మిట్టల్‌కు చెందిన ఎయిర్‌టెల్ కంపెనీలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. అలాంటిది ఇవి అకస్మాత్తుగా తమ అభ్యంతరాలన్నింటినీ అటకెక్కించి స్టార్‌లింక్‌తో అంటకాగడానికి సిద్ధపడుతూ ఒప్పందాలు చేసుకోవడం ఈ అనుమాలకు తావిస్తోంది. ఈ ఒప్పందాలు స్పెక్ట్రమ్ కేటాయింపులు, జాతీయ భద్రతాంశాలపై కూడా తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. దేశంలో క్లిష్టమైన పరిస్థితేదైనా ఎదురైనపుడు కనెక్టివిటీని ఎవరు నియంత్రిస్తారు? అమెరికాకు చెందిన స్టార్‌లింకా, లేక భారతీయ భాగస్వామ్యులైన ఎయిర్‌టెల్, జియో సంస్థలా? సాంకేతిక అభివృద్ధి అత్యున్నత దశలో కొనసాతున్న ఈ కాలంలో ఒక దేశ రక్షణకు ఈ శాటిలైట్ స్పెక్ట్రమ్ (ఉపగ్రహ తరంగ వ్యవస్థ) అనేది చాలా కీలకంగా మారింది. అన్ని దేశాలకూ ఒక అపూర్వమైన వనరుగా అందుబాటులోకి వచ్చింది. నేటి ఆధునిక ప్రపంచంలో ఇది అందించే ప్రయోజనాలు ఏ దేశానికైనా అనివార్యమైన అవసరం. బ్రాడ్‌కాస్టింగ్, మొబైల్ నెట్‌వర్క్ వంటి సమాచార సేవలతో పాటు నావిగేషన్ సిస్టమ్స్, వాతావరణ పరిశోధన, దేశ రక్షణ, సురక్షితమైన మిలటరీ కమ్యూనికేషన్‌కు ఇది అందించే సేవలు అసాధారణమైనవి. అందుకే ఇది ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుందని, దీన్ని ప్రైవేటు సంస్థలకు కేవలం పారదర్శకమైన, బహిరంగ వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని సుప్రీంకోర్టు 2జీ స్పెక్ట్రమ్ కేసులో స్పష్టం చేసింది. ఇందుకు భిన్నంగా ప్రయివేటు ఒప్పందాల ద్వారా స్పెక్ట్రమ్ కేటాయింపులు జరగడం చట్టవిరుద్ధం. మరి అలాంటప్పుడు ఏ ప్రాతిపదికన ఈ ఒప్పందాలు జరిగినట్టు? జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? జాతీయ భద్రతను కూడా తాకట్టు పెట్టేంతగా సర్కారు సాగిలపడాల్సిన అవసరమేమిటి? ఈ ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పాలి. లేదంటే 'ఇది ట్రంపు దయకోసం మోదీ పాకులాట' అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను అంగీకరించినట్టే అవుతుంది. ఇది భారతదేశ కక్ష్యా స్థలాల (ఆర్బిటల్ స్లాట్స్)పై కూడా తీవ్ర ప్రభావం చూపించే అంశం. ఈ ఒప్పందం మూలంగా సదరు విదేశీ కంపెనీ తన శాటిలైట్‌లను మన సహజ వనరుల మ్యాపింగ్, వాణిజ్యపరంగా విలువైన డేటా సేకరణ, ముఖ్యంగా మన వ్యూహాత్మక మిలిటరీ, రక్షణ డేటాను సేకరించడానికి వినియోగిస్తే, అది మన జాతీయ భద్రతకే పెను ప్రమాదం. ఒక విదేశీ కంపెనీని మన శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను, ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించటమంటే అది రోదసీపై గుత్తాధిపత్యానికి అవకాశమివ్వడమే అవుతుంది. మన సార్వభౌమాధికారంపై, జాతీయ భద్రతపై రాజీపడడమే అవుతుంది. ఇటీవల రష్యాతో చర్చలు జరిపేలా ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు, ఉక్రెయిన్ ఖనిజ వనరులను తమకు అప్పగించాలన్న డిమాండ్లను అంగీకరింపజేసేందుకు ఉక్రెయిన్ మిలటరీకి స్టార్‌లింక్ సేవలను నిలిపివేస్తామని అమెరికా హెచ్చరించడం, ఆ బెదిరింపులకు ఉక్రెయిన్ లొంగిపోవడం ఇందుకో ఉదాహరణ. భూకక్ష్యలో తిరుగాడే భారీ ఉపగ్రహ సముదాయం (మెగా కాన్‌స్టలేషన్) అనేది ఓ అద్భుత ఆవిష్కరణ అనడంలో సందేహంలేదు. అయితే దీనివల్ల లెక్కకు మించిన ప్రయోజనాలున్నాయన్నది ఎంత నిజమో.. దాని వినియోగంపై నియంత్రణ కొరవడితే అంతకు మించిన ప్రమాదాలున్నాయనేది కూడా అంతే నిజం. టెక్నాలజీ అందించిన అద్భుత ఫలితాలు సమాజ ప్రయోజనాలకే తప్ప సంపన్నుల స్వార్థానికి ఉపయోగపడరాదు.

## ఐటీడీఏ ఏర్పాటుపై 25న చలో కలెక్టరేట్




(సత్యంన్యూస్, కొత్తూరు)

జిల్లాలో షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటీడీఏని ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 25న చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న పిలుపునిచ్చారు. ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇరపాడు గూడ, కొత్తగూడ గొట్టుపల్లి, భూతలగూడ తదితర గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం జీసీసీ ద్వారా ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, జీసీసీ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మధ్య గిరిజన ఉత్పత్తులు 21 రకాల ఉత్పత్తులను 2027 వరకు కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేసి కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. గిరిజన ఉత్పత్తులను బయట వర్తకులు కొంటే ఫారెస్ట్ శాఖ ఫైన్లు వేయడంతో గిరిజన ఉత్పత్తులు గిట్టుబాటు ధర లేక తీవ్ర అన్యాయం గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, ముఖలింగం, కృష్ణ, రమణ, మోహన్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలసలో నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో 415వ రోజు దివంగత పుష్పాదేవి జ్ఞాపకార్థం ఆమె భర్త చగన్ లాల్ జి లిఖమానియా, కుటుంబ సభ్యులు (బొంబాయి అహ్మదా బాద్ టెక్స్‌టైల్ ట్రేడర్స్, పొట్టి స్వామిస్ట్రీట్, విజయవాడ) వారు 35 మందికి అన్న సంతర్పణ, సబ్జా బాటిల్ పంపిణి చేశారు.

- సత్యంన్యూస్, ఆమదాలవలస

### లైన్ ఇన్‌స్పెక్టర్‌పై చెయ్యి చేసుకున్న

# శ్రీనుపై చర్యలు తీసుకోవాలి



- రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు
- చర్యలు తీసుకోకపోతే తదుపరి కార్యాచరణకు మేం సిద్ధం
- ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు యూనియన్ నాయకుల ఫిర్యాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డీ-2 సెక్షన్ పరిధిలో విద్యుత్ బిల్లు చెల్లించని వ్యక్తికి సర్వీసు నిలుపుదల చేసేముందు సమాచారం ఇవ్వడానికి వెళ్లిన లైన్‌మేన్‌పై చెయ్యిచేసుకున్న పెద్దపాడుకు చెందిన కలగ శ్రీను మీద ఆ రోజే ఫిర్యాదు చేసినా రూరల్ పోలీసులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్ని యూనియన్లు సంయుక్తంగా ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమూర్తిని కలిసి ఫిర్యాదు చేశాయి. ఈమేరకు మంగళవారం ఎస్‌ఈకి ఫిర్యాదు ప్రతిని అందజేశారు. నాలుగు విద్యుత్ సర్వీసులకు సంబంధించి గత నవంబరు నుంచి బకాయి ఉన్న రూ.15వేలు కట్టకపోవడం వల్ల సర్వీసుల నిలుపుదల చేయాల్సి ఉంటుందని సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లిబాబు, లైన్‌మేన్ ఎం.భాస్కరరావు, జేఎల్‌ఎంలు కె.చలపతిరావు, జి.హరికృష్ణల బృందం సమాచారం ఇవ్వడానికి వెళ్లిన నేపథ్యంలో పెద్దపాడుకు చెందిన టీడీపీ నాయకుడు కలగ శ్రీనివాసరావు సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌పై చెయ్యి చేసుకున్నారని ఎస్‌ఈకి వివరించారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆరోజే ఫిర్యాదు చేశామని, అయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌పైనే చెయ్యి చేసుకున్న వ్యక్తిపై ఇప్పటి వరకు చర్యలు లేకుంటే, మామూలు సిబ్బంది గతేమిటని, ఇక అందరూ దీన్ని అనుసరించే ప్రమాదం ఉందని ఎస్‌ఈ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తక్షణమే స్పందించాలని, కార్మికునికి న్యాయం జరిగేలా చూడాలని, శ్రీనుపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈని కోరారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోని పక్షంలో అన్ని సంఘాల నాయకులతో కలిసి తదుపరి కార్యాచరణకు పూనుకోవాల్సి ఉంటుందని ఎస్‌ఈ దృష్టికి తెచ్చారు. ఎస్‌ఈని కలిసినవారిలో విద్యుత్ కార్మికుల సంఘాల నాయకులు ఎం.ప్రభాకర్ (1104), టీవీ సుబ్రహ్మణ్యం (1104) కె.వైకుంఠం (తెలుగునాడు), సీహెచ్ పాపారావు (327), బి.గురునాథరావు (బహుజన యూనియన్) తదితరులు ఉన్నారు.

# తన మార్కెటింగ్ ఫార్ములాతో అందరినీ అబ్బా అనిపించిన "కిరణ్ అబ్బవరం"



తెలుగు ఇండస్ట్రీలో వరుస ఫ్లాప్ సినిమాలతో దూసుకెళ్తున్న కిరణ్ అబ్బవరంకి సడెన్ హిట్‌తో పెద్ద బ్రేక్ వచ్చింది "క" అనే సినిమాతో, గత సంవత్సరం దీపావళికి విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. అంతకు ముందు సినిమా "రూల్స్ రంజాన్" చూశాక ఇతని మీద ప్రేక్షకులు పూర్తిగా నమ్మకం కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. ముందుగా ఇతన్ని హీరోగా సినిమా ఇండస్ట్రీలోకి తీసుకొచ్చి, అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా పక్కన పెట్టేసింది.

దాంతో అతనికి ఏం చేయాలో అర్థం కాక ఆలోచించి కొన్ని నెలల బ్రేక్ తీసుకున్నాడు. ఆ తర్వాత జాగ్రత్తగా, శ్రద్ధగా 'క' సినిమా సబ్జెక్ట్ స్టడీ చేసి, ఇద్దరు దర్శకులతో ఆ సినిమా తీసి పెద్ద సక్సెస్ అందుకున్నాడు. ఇక ఇతడు సక్సెస్ బాటలో పడ్డాడనే అంతా అనుకున్నారు. ఆ తర్వాత ఇదే "క" సినిమాని మళయాళంలో దుల్కర్ సల్మాన్ ప్రొడక్షన్ కు డబ్బింగ్ రైట్స్ అమ్మేసారు. అక్కడ రిలీజై మళ్లీ ఫెయిల్యూర్ అయ్యాడు. ఐతే ఇప్పుడు న్యూ రిలీజ్ "దిల్ రూబా" సినిమాతో మళ్లీ తను పాత బాటలోకే వెళ్లిపోయినట్లే అనిపించింది. ఈ సినిమా చూసిన ప్రేక్షకులకు మళ్ళీ పాత రోజులే గుర్తుకు వచ్చాయి. "క" తర్వాత కిరణ్ ఇలాంటి సినిమా తీసాడేంట్రా బాబూ అని అందరూ ఆశ్చర్యపోతున్నారు.

ఇక్కడ జరిగిన వాస్తవం ఏమిటంటే..? "క" కంటే ముందే చేసిన సినిమా "దిల్ రూబా" అయితే దాన్ని మధ్యలో ఆపి, "క" సినిమా తీసి దాంతో మంచి ఫలితాన్నందుకున్నాడు. తన కెరీర్ లో అంతకుముందున్న దారుణమైన ఫ్లాప్ ల్లానే "దిల్ రూబా" సినిమా కూడా రిలీజై ఉంటే..! ఆ సినిమాకు మినిమం ఓపెనింగ్స్ కూడా వచ్చేవి కావు. పైగా తన కెరీర్ మైనస్ అయ్యేది. అతను అదే సమయంలో "క" తన కెరీర్‌ను మలుపు తిప్పగలదని నమ్మి దాన్ని ముందుగా రిలీజ్ చేశాడు.

"క" సక్సెస్ వల్ల కిరణ్ మీద ప్రేక్షకులకే కాదు, ఒక సంస్థకు కూడా మంచి నమ్మకం కుదిరింది కాబట్టే "దిల్ రూబా" సినిమాను వాళ్లు కొని రిలీజ్ చేశారు. తద్వారా నిర్మాతలు సేఫ్ అయిపోయారు. సినిమా ఎలా ఉన్నప్పటికీ.. ట్రైలర్ బాగా సెట్ చేయడం, ప్రీరిలీజ్ ఈవెంట్ చేసి బైక్ గిఫ్ట్ లాంటివి పెట్టి ప్రమోషన్ లో భాగంగా చక్కగా అన్నీ వాడుకున్నారు. దాంతో పాటు "క" తాలూకు పాజిటివిటీ "దిల్ రూబా"కు జత కావడంతో సినిమాకు ఓపెనింగ్స్ పర్వాలేదనిపించాయి. ముందు రెడీ అయింది కదా అని..!

"క" కంటే ముందే "దిల్ రూబా"ను రిలీజ్ చేసి ఉంటే అతని కథ ఇంకోలా ఉండేది. ఈ సినిమాకు బిజినెస్ అండ్ బజ్ క్రియేటయ్యేది కాదు, ఓపెనింగ్స్ కూడా వచ్చేవి కావు. మొత్తంగా "దిల్ రూబా" హోల్డ్‌లో పెట్టి "క" పూర్తిచేసి రిలీజ్ చేయడం తెలివైన ఎత్తుగడ వేసాడు. కాబట్టే "దిల్ రూబా"ను సేల్ చేసి మార్కెట్ చేయగలిగాడు కిరణ్ అబ్బవరం.ఇదీ మార్కెటింగ్ స్ట్రాటజి అంటే..!

- అశోక్ పోతురాజు

# 'విశ్వంభర'పై చిరు క్లారిటీ



'విశ్వంభర' రిలీజ్ డేట్ విషయంలో మెగా ఫ్యాన్స్ కన్ఫ్యూజన్ ఇంకా పోలేదు. ఏప్రిల్‌లో ఈ సినిమా రావాలి. ఆ తరవాత మే 9 అన్నారు. ఈ రెండు డేట్లూ పోయినట్టే. వేసవిలో ఈ సినిమా రాదన్నది ఇండస్ట్రీ వర్గాల టాక్. మరి ఎప్పుడొస్తుంది? ఆగస్టు 22 సందర్భంగా ఈ సినిమాని విడుదల చేస్తే బాగుంటుందన్నది యూవీ క్రియేషన్స్ ఆలోచన. చిరంజీవి కూడా 'విశ్వంభర' రిలీజ్ డేట్ గురించి ఏమాత్రం కంగారు పడడం లేదు. వీఎఫ్ఎక్స్‌తో పెట్టుకొంటే పనులు ఓ పట్టాన తెవలవు అని ఆయనకు కూడా బాగా తెలుసు. పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ అయి పోయిన తరవాత, వీఎఫ్ఎక్స్ చూసుకొని, అన్ని విధాల సంతృప్తి పడిన తరవాతే.. రిలీజ్ డేట్ ఫిక్స్ చేద్దామని చిరు చెప్పారట. కాబట్టి నిర్మాతలకూ కంగారు లేదు. కాకపోతే పెరిగిపోతున్న వడ్డీ రేట్లు భరించడం కొంత కష్టమే. హిందీ రైట్స్ రూపంలో యూవీకి మంచి రేటే వచ్చింది. ఇక శాటిలైట్ డీల్ క్లోజ్ చేయాల్సివుంది. ఇది వరకు విశ్వంభరని లైట్ తీసుకొన్న ఓటీటీ సంస్థలు ఇప్పుడు బేరాలకు దిగాయని, మంచి రేటు వస్తే, డీల్ క్లోజ్ చేస్తామని నిర్మాతలు చెబుతున్నారు. ఓ పాట మినహా షూటింగ్ కూడా పూర్తయినట్టే. ఎలాగూ కావల్సినంత టైమ్ వుంది కదా. రిలీజ్‌కు ముందు ఈ పాట పూర్తి చేసినా చాలు. త్రిష కథానాయికగా నటించిన ఈ చిత్రానికి వశిష్ట దర్శకుడు. - తెలుగు 360.కామ్ సౌజన్యంతో..



# అలాంటి పాత్ర ఇప్పుడొస్తే ఇంకా బాగా చేస్తా!

అర్జున్ రెడ్డి సినిమాతో హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది షాలినీ పాండే. మొదటి సినిమాతోనే సూపర్‌హిట్‌ను అందుకున్న షాలినీ, ఆ తర్వాత పలు అవకాశాలను అందుకుని తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేసింది. తాజాగా షాలినీ ఓ ఇంటర్వ్యూలో పాల్గొని పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. అర్జున్ రెడ్డి సినిమాలో ప్రీతి పాత్రతో ప్రతీ ఒక్కరినీ మెప్పించింది షాలినీ. అయితే అర్జున్‌రెడ్డి రిలీజ్ టైమ్‌లో ఆ సినిమాలోని హీరో హీరోయిన్ల పాత్రలను కొందరు కామెంట్ చేశారు. హీరోయిన్ క్యారెక్టర్ చాలా వీక్‌గా ఉందని అన్నారు. తాజాగా షాలినీకి ఈ విషయమై ఓ ప్రశ్న ఎదురైంది. ప్రీతి తరహా పాత్ర ఇప్పుడొస్తే యాక్సెప్ట్ చేస్తారా అని అడిగారు. ఆ ప్రశ్నకు షాలినీ ఆసక్తికర సమాధానమిచ్చింది. ప్రీతి పాత్రను తను కెరీర్ స్టార్టింగ్ లో చేశానని, ఇప్పుడు దాని గురించి ఆలోచిస్తే ఎంతో ఇన్నోసెంట్‌గా అనిపిస్తుందని, సినిమాలో తన క్యారెక్టర్ ను మరింత బలంగా చేయొచ్చుమో అనిపిస్తుందని ఇప్పుడు అలాంటి పాత్ర వస్తే నో చెప్పను కానీ ఆ పాత్రపై మరింత అవగాహన పెంచుకుని నటిస్తానంటోంది షాలినీ. అప్పుడు యాక్టింగ్ కొత్త కాబట్టి ప్రీతి పాత్రను గొప్పగా చేయలేకపోయానని, ప్రస్తుతం నటనలో పరిణీతి చెందాను కాబట్టి ఆ పాత్రను మరింత మెచ్యూర్డ్‌గా చేయగలనని చెప్తోన్న షాలినీ, ఇప్పుడలాంటి క్యారెక్టర్ వస్తే డైరెక్టర్‌తో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకుని ఆ పాత్రలో నటిస్తానంటోంది. డబ్బా కార్టెల్ సిరీస్‌లో ఎంతో బలమైన మహిళ పాత్రలో కనిపించిన షాలినీ అందులో రాజీ అనే పాత్రలో నటించింది. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సిరీస్‌లో జ్యోతిక, షబానా అజ్మీ కీలక పాత్రల్లో నటించగా, ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. - తుపాకి.కామ్ సౌజన్యంతో...



# అమ్చీ ముంబై.. ఆ కొందరి చేతుల్లోనే!

**అమ్చీ ముంబై. ముంబైనెరిగినవారు బాగా వాడే మాట. దేశ ఆర్థిక రాజధాని. ఫ్యాషన్ కు ప్యారిస్. అండర్ వరల్డ్ అడ్డా. ఇలా చెప్పుకుంటూ పోతే.. వడాపావుతో ఉదయాన్నే పని ప్రారంభించేందుకు లోకల్ ట్రైన్ ఎక్కే సామాన్యుడి నుంచి.. ఎగిసిపడే అరేబియన్ సముద్రపు అలల ఒడ్డున అరేబియన్ గుర్రాలపై విహరించే సంపన్నుల వరకూ కలల నగరం. సుమారు 1 కోటి 30 లక్షల మంది జనాభా కల్గి.. ఆసియాలోనే అత్యంత ధనికులెక్కువ మంది ఉన్న అర్బనైజ్డ్ కాంక్రీట్ జంగల్. అలాంటి ముంబైలో పదిశాతం భూమి ఒక ఆరుగురి చేతుల్లో ఉందంటే మీరు నమ్మగలరా..? కానీ, నమ్మితీరాలి. ఎలా అంటే.. అందుకోసారి మనం స్లమ్ రిహాబిలిటేషన్ అథారిటీ నిర్వహించిన సర్వే గురించి తెలుసుకోవాలి.**

### ఆరుగురు భూస్వాముల చేతుల్లో పది శాతం కంటే ఎక్కువ భూమి!

మహారాష్ట్రలో మురికివాడల అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఎస్ఆర్ఏ అనే సంస్థ సర్వే ప్రకారం.. ముంబై రియల్ ఎస్టేట్ వ్యాపారం మొత్తం 1 లక్ష ఎకరాల్లో విస్తరించి ఉంటే.. అందులో నివాసయోగ్యమైన భూమి 34 వేల ఎకరాలు. ఆ మొత్తం భూమిలో కేవలం కొందరు భూస్వాములు మాత్రమే.. ట్రస్టులు, ప్రైవేట్, కార్పోరేట్ సంస్థల పేరుతో.. 20 శాతం భూమిని కల్గి ఉంటే నివాసయోగ్యమైన ప్రాంతాల్లో ఆ 20 శాతంలో సగం భూమి విఖ్రోలి ప్రాంతంలో గోద్రేజ్ కుటుంబానికి చెందిందన్నది ఆ నివేదిక సారాంశం.

### గోద్రెజ్ ప్రాపర్టీస్!

ముంబైలోని విఖ్రోలి ప్రాంతంలో ఎస్ఆర్ఏ సర్వే ప్రకారం.. గోద్రేజ్ కుటుంబం 3 వేల 400 ఎకరాలకు పైగా భూమిని కలిగి ఉంది. ఈస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవేలో ఉన్న ఈ భూమి అత్యంత విలువైంది కావడంతో.. ఇప్పటివరకూ ముంబైలో అగ్రశ్రేణి భూయజమానుల జాబితాలో గోద్రెజ్ కుటుంబం పేరే ప్రధానంగా వినిపిస్తోంది.

సబ్బులు, ఇతర గృహోపకరణాల నుంచి మొదలుకుంటే రియల్ ఎస్టేట్ రంగం వరకూ ప్రతీరంగంలోనూ విస్తరించిన గోద్రేజ్ గ్రూప్ ఇప్పుడు విడిపోగా ఆది గోద్రేజ్, తన సోదరుడు నాదిర్ గోద్రేజ్‌కు ఐదు భారీ పరిశ్రమలు రాగా.. కజిన్స్ అయిన జంషేడ్, స్మితకు అన్ లిస్టెడ్ ఇండస్ట్రియల్ సెక్టార్ లోని అనుబంధ సంస్థలతో పాటు.. ముంబైలోని ప్రధాన ఆస్తిగా చెప్పుకుంటున్న భూమి దక్కింది.

3, 400 ఎకరాల ల్యాండ్ గోద్రేజ్ కుటుంబం పేరిట ఉన్నప్పటికీ వాటిని పొందే విషయంలో ల్యాండ్ సీలింగ్

| | |
|---|---|
| Godrej family | 3,401 acres |
| FE Dinshaw Trust | 683 acres |
| Pratapsingh Surji Vallabhdas family | 647 acres |
| Jeejeebhoy Ardeshir Trust | 508 acres |
| AH Wadia Trust | 361 acres |
| Byramjee Jeejeebhoy Trust | 269 acres |

Source: Slum Rehabilitation Authority (SRA)



రిజర్వేషన్స్ తో కూడిన పరిమితులున్నాయి. ముఖ్యంగా విఖ్రోలి సెంట్రల్ సబర్బన్ భాగంలో గోద్రేజ్ భూముల్లో అడవులు, మడ అడవులు, సముద్ర తీర ప్రాంతం ఉండటంతో ఈ రిజర్వేషన్ తప్పనిసరి. ఈ క్రమంలో అలా కొంత భూమిని గోద్రేజ్ కుటుంబం కోల్పోయినప్పటికీ వారికి దక్కే భూమి విలువ 30 వేల కోట్లుంటుందని ఓ అంచనా. ఇక బయట మార్కెట్ లో రియల్ ఎస్టేట్ బూమ్ ప్రకారమైతే 50 వేల కోట్ల రూపాయల విలువ ఉంటుదన్నది ఎస్ఆర్ఏ సర్వే సంస్థకు ముంబై సెంట్రల్ సబర్బన్ కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ డెవలపర్ చెప్పిన లెక్క.

### ఫ్రమ్రోజ్ దిన్షా ట్రస్ట్!

ఇక గోద్రేజ్ కుటుంబం తర్వాత మరో బడా భూయాజమాన్యం కల్గి ఉన్న ఫ్యామిలీ ఫ్రమ్రోజ్ దిన్షాలది. వీరు స్థాపించిన ట్రస్ట్ పేరు మీద ముంబైలో సుమారు 683 ఎకరాల భూమిని కల్గి ఉన్నారు. మలాడ్ పరిసర ప్రాంతాల్లో వీరు ఈ భూమి కల్గి ఉన్నట్టు ఎస్ఆర్ఏ సర్వే సంస్థ వెల్లడించింది. పార్సీ కుటుంబీకుడైన ఫ్రమ్రోజ్ దిన్షా ఫైనాన్షియర్, పెద్ద ల్యాండ్ లార్డ్. అయితే, ఈ కుటుంబానికి చెందిన భూములను పలుమార్లు మహారాష్ట్ర ప్రభుత్వం భూపరిమితి చట్టాల పేరుతో పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకున్న దాఖలాలూ ఉన్నాయి.

### మిగిలినవారి కథ..?

ఇక గోద్రేజ్, ఫ్రమ్రోజ్ దిన్షాల తర్వాత.. ప్రతాప్ సింగ్ వల్లభదాస్ సూర్జీ కుటుంబం ముంబైలోని భాండూప్ ప్రాంతంలో 647 ఎకరాల భూమిని కల్గి ఉంది. అలాగే, జీజీభాయో ఆర్దేషిర్ ట్రస్ట్ ముంబైలో నాల్గో అతి పెద్ద భూయజమానిగా సర్వేలో తేలింది. ఈ ట్రస్ట్ పేరిట చెంబూరులో 508 ఎకరాల భూమి ఉంది. ఇక మరో పార్సీ కుటుంబీకుడైన వాడియా ట్రస్ట్ కు కుర్లాలో 361 ఎకరాల భూమి ఉండగా.. చెంబూరు ప్రాంతంలో మూడింట ఒకటో వంతు వీరి పేరిటనే ఉండేదనేది ఎస్ఆర్ఏ సర్వే సంస్థ చెబుతున్న మరో రిపోర్ట్. కుర్లా ప్రాంతంలో ఉన్న ఈ అత్యంత విలువైన భూమిని 19వ శతాబ్దం ప్రారంభంలో ఆర్దేషిర్ హెూర్ముస్జీ వాడియా ఏడాదికి కేవలం 3 వేల 587 రూపాయలకు లీజుకు తీసుకున్నారు. కానీ, వారి పేరిట క్రమంగా క్రమబద్ధీకరణ కావడంతో పాటు.. ఆ 361 ఎకరాల్లో ఇప్పుడు చాలావరకూ కబ్జాలకు గురైందన్నది ఎస్ఆర్ఏ నివేదిక బహిర్గతం చేసిన విషయం. అలాగే బైరామ్జీ బీబీభాయ్ గ్రూప్ ముంబైలోని వివిధ ప్రాంతాల్లో తన ట్రస్ట్ పేరిట 269 ఎకరాల భూమిని కల్గి ఉంది. ఈ కుటుంబం 1830లోనే ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి మొత్తం 12 వేల ఎకరాలతో కూడిన ఇప్పుడు ముంబై మహానగరంలో కలిసిన ఏడు గ్రామాల్లోని భూమిని పొందారు. అంతేకాదు, ప్రస్తుతం ముంబై ఐకానిక్ హెూటల్ గా వెలుగొందే తాజ్ హెూటల్ పక్కన బాంద్రా ఎండ్ ప్రాంతంలోనూ వీరి భూములున్నాయి.

వీరితో పాటు.. సర్ మహమ్మద్ యూసుఫ్ ఖోట్ ట్రస్ట్, వీ.కే.లాల్ ఫ్యామిలీ, ఇతర కొందరు ప్రైవేట్ భూస్వాములు ముంబైలోని కంజుర్ మార్గ్, కాండివాలీ ప్రాంతాల్లో పెద్దఎత్తున భూములు కల్గి ఉన్నారు.

### ముంబై భూయజమానుల్లో పార్సీలదే ఆధిపత్యం!

తళుకుబెళుకుల ముంబై మహానగంలో పార్సీలే అందరికంటే పెద్ద ల్యాండ్ లార్డ్స్. మధ్యయుగ కాలంలో భారతదేశంలో పాలకుల తరపున వ్యవసాయ ఉత్పత్తులపై కొందరు పన్నులు వసూళ్లు చేసేవారు. వారినే జమీందార్లనీ, దేశ్ ముఖ్ లనీ, ఖోట్‌లనీ వివిధ పేర్లతో పిలుస్తుంటాం. బ్రిటీషర్స్ ముంబైని పాలించే సమయంలో మరాఠా హిందువులు, కొంకణ్ ముస్లింలతో సహా చాలామంది సంపన్నులకు అనేక గ్రామాలనిచ్చారు. ఓపీయమ్ వంటి నల్లమందుతో పాటు.. పత్తి వ్యాపారంలో వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా.. అందులో పార్సీలు బాగా విజయవంతమయ్యారు. దాంతో వారు మరింత ఎదిగి ఈ ద్వీపకల్పంలో ల్యాండ్ లార్డ్స్‌గా ఎదిగినట్టు సర్వే వెల్లడించింది. అయితే, ఈ ప్రైవేట్ వ్యక్తులు, బడా బిజినెస్ మ్యాగ్నెట్స్, ట్రస్టులు, సంపన్న కుటుంబాలవారే గాకుండా.. ముంబై పోర్ట్ ట్రస్ట్, నేషనల్ టెక్స్ టైల్స్ కార్పోరేషన్, మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే వంటి ప్రభుత్వరంగ సంస్థలూ భారీగా భూములు కల్గిఉన్నట్టు స్లమ్ రిహాబిలిటేషన్ సంస్థ సర్వే వెల్లడించింది.

మొత్తంగా ముంబై వంటి మహానగరాన్ని పార్సీ కుటుంబాలు ఎలా శాసిస్తున్నాయో చెప్పడానికి ఫిలాంత్రోపిస్టులుగా పరోపకారం పేరుతో క్యాపటిలజం ఎలా వేళ్లూనుకుపోయిందో కళ్లకు కట్టేందుకు ఎస్ఆర్ఏ సర్వేలో వెల్లడైన భూవివరాలు ఓ చిన్న ఉదాహరణ మాత్రమే.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..


## కాకినాడ ఆదిత్యలో ఉచిత ఆన్లైన్ మాక్‌టెస్ట్‌లు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉపయోగపడే ఈఏపీ సెట్, నీట్, జేఈఈ అడ్వాన్స్, మెయిన్స్‌కు ఉపయోగపడే ఆన్‌లైన్ టెస్టులను ఉచితంగా అందివ్వనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి టెస్ట్‌లు రాయడం వలన విద్యార్థికి కంప్యూటర్ వినియోగంపై అవగాహన వస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా అరసవిల్లి జంక్షన్‌లోని తమ కళాశాలలో సంప్రదించవచ్చని, లేదా 79971 76662 నెంబరుకు ఫోన్‌లో సంప్రదించవచ్చని అన్నారు.

## మీసేవకు అన్ని సర్వీసులపై హర్షం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మీసేవ సెంటర్లకు అన్ని సర్వీసులు వచ్చేటట్లు చేస్తానని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించడంపై మీసేవ ఆపరేటర్ల వెల్ఫేర్ ప్రతినిధులు హర్షం తెలిపారు. సచివాలయ శాఖ నుంచి ఐటీ శాఖలోకి మార్చుతున్నామని రాష్ట్రంలోని మీసేవ ఆపరేటర్లకు అసెంబ్లీ సాక్షిగా వాగ్దానం చేయడం అభినందనీయమన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మీసేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఠి.74/2012) వర్కింగ్ ప్రెసిడెంట్ అధికారి, శ్రీకాకుళం జిల్లా మీసేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా మీసేవ ఆపరేటర్స్ అందరి తరఫున మంత్రి లోకేష్‌కు అభినందనలు తెలిపారు.

## కలగ లిజీకి ఎక్స్‌లెన్స్ పురస్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




శ్రీకాకుళంరూరల్ మండలం పెద్దపాడుకు చెందిన కలగ లిజీ పౌర విమానయాన విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో ఎక్స్‌లెన్సీ ఇన్ క్యూరేటింగ్ అకడమియా ఫర్ ఇండియన్ ఏవియేషన్ పురస్కారం లభించిందని ఆమె తండ్రి జగదీష్ తెలిపారు. ఇటీవల ఢిల్లీలో యూనివర్సల్ మీడియా నిర్వహించిన మూడో ఆసియా లీడర్‌షిప్ అవార్డు పొందారని చెప్పారు. దశాబ్దకాలంగా పౌర విమానయాన పరిశ్రమకు సంబంధించి పలువురికి శిక్షణ ఇస్తున్నారని వివరించారు.

## వినాయకమందిరం పునర్నిర్మాణానికి రూ.50వేలు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తోటవీధి వినాయక మందిరం పునర్నిర్మాణానికి నాదెళ్ల నీలాచలం, కృష్ణవేణి దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు న్యాయవాది నాదెళ్ల భార్గవ రూ.50,001 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పన్నాల నర్సింహమూర్తి, పార్నంది విజయకుమార్, అంధవరపు సుబ్బారావు, తేజోమూర్తుల నాగరాజు, సన్యాసిరావు, బాదం మిల్క్ సంతోష్ పాల్గొన్నారు.



## మహిళల రక్షణ కవచంగా 'శక్తి యాప్'



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్‌స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా కంప్లైంట్ చేయొచ్చని శక్తి టీం సీఐ త్రినేత్రి, ఎస్.ఐ రవి అన్నారు. బుధవారం స్థానిక జెమ్స్ మెడికల్ కాలేజీలో ఈ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళలకు ఆపద కాలంలో అత్యవసర సహాయం అందించేందుకు శక్తి యాప్ కీలకంగా పని చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఈ శక్తి యాప్‌లో తప్పిపోయిన పిల్లల వివరాలు, అక్రమ కార్యకలాపాలపై రిపోర్టు చేయడం, రాత్రివేళల్లో భద్రతతో కూడిన ప్రయాణం, పోలీసు అధికారుల వివరాలు తదితర ఫీచర్స్‌ను పొందుపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొనగా, 60 మంది మొబైల్స్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు.















# కొత్త రోడ్లకు నిధులివ్వండి

**- చంద్రబాబును కోరిన కలిశెట్టి -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయనగరం పార్లమెంట్ పరిధిలో అనేక కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన చంద్రబాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఆయన తన నియోజకవర్గ పరిధి రెండు జిల్లాల్లో విస్తరించి వుందని, వీటికి కొత్త కనెక్టివిటీ ఇవ్వాలంటే ఉన్న రోడ్లను వెడల్పు చేయడం, కొత్త రోడ్లు నిర్మించడం ఒకటే మార్గమని, ఈమేరకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 60 మంది ఓటర్లకు ఒక నాయకుడు పర్యవేక్షించే విధంగా రూపకల్పన చేసే వ్యవస్థపై చంద్రబాబుకు ఆయన అభినందనలు తెలియజేశారు. తన సొంత గ్రామం రణస్థలం మండలం వీఎన్ పురంలో 60 మంది ఓటర్ల తరపున తాను పోలింగ్ బూత్ వ్యవహారాలు చూస్తానని ఆయన చంద్రబాబుకు మాటిచ్చారు.






## బిల్‌గేట్స్‌తో సీఎం చంద్రబాబు భేటీ



**న్యూఢిల్లీ:** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఢిల్లీలో సుమారు 40 నిమిషాల పాటు వీరిద్దరి సమావేశం జరిగింది. గేట్స్ ఫౌండేషన్, ఏపీ ప్రభుత్వం మధ్య కీలక ఒప్పందాలు జరగనున్నాయి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ ఏపీకి సహకారం అందించనుంది. వీటికి సంబంధించిన అంశాలపై గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఏపీ ప్రభుత్వ అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే బిల్‌గేట్స్‌తో చంద్రబాబు సమావేశమై పలు ఒప్పందాలపై చర్చించారు.

# అమెజాన్‌లో 14వేల ఉద్యోగాల కోతకు రెడీ!




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా మేనేజింగ్ విభాగంలోని 14వేల మందిని తొలగించబోతోందని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెజాన్ శ్రామిక శక్తిలో ఈ సంఖ్య 13 శాతంతో సమానం. ఈ కొలువులు తొలగింపు వల్ల సంస్థకు ఏడాదికి రూ.210 కోట్ల నుంచి రూ.360 కోట్లు ఆదా అవుతుందని అంచనా. ఈ తొలగింపులు చేపడితే ఇ-కామర్స్ సంస్థలో మేనేజర్ల సంఖ్య 1.05 లక్షల నుంచి 91వేలకు తగ్గనుందని 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' తెలిపింది. కంపెనీ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఇటీవల కమ్యూనికేషన్, సస్టెయినబిలిటీ విభాగాల్లో ఉద్యోగాలను అమెజాన్ తొలగించింది. ఇప్పుడు మేనేజింగ్ విభాగంపై దృష్టి సారించింది. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచే అమెజాన్ ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందులో భాగంగా మేనేజర్లకు వచ్చే డైరెక్ట్ రిపోర్టుల సంఖ్యను పెంచింది. అలాగే, సీనియర్ లెవల్‌లో ఉద్యోగాల నియామకాన్ని కూడా పరిమితం చేసింది. పరిహారానికి సంబంధించిన విధివిధానాలను పునః సమీక్షించుకోవడం వంటి చర్యలు చేపట్టింది. తాజాగా ఉద్యోగాల తొలగింపును చేపట్టేందుకు సిద్ధమవుతోంది. నిర్వహణ సామర్థ్యాలు, లాభదాయకతను పెంచుకోవడంపై గత కొన్నాళ్లుగా అమెజాన్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది జనవరి నుంచి వారానికి ఐదు రోజుల పాటు ఆఫీసుకు రావాలని ఉద్యోగులకు కంపెనీ సీఈఓ ఆండీ జాస్సీ పేర్కొన్నారు. అప్పుడే వేగంగా నేర్చుకోవడంతో పాటు తోటివారితో మెరుగైన సంబంధాలు కలిగి ఉండడానికి కారణమవుతుందన్నారు. కోవిడ్ సమయంలో అమెజాన్ ఉద్యోగుల సంఖ్యను భారీగా పెంచుకుంది. దీంతో 2019 నాటికి రూ.7.98 లక్షలుగా ఉన్న సంఖ్య 2021 నాటికి రూ.16 లక్షలకు పెరిగింది. ఆపై ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా 2022, 2023లో వివిధ సందర్భాల్లో 27వేల మందిని తొలగించింది.

**- సత్యం ఐటీ డెస్క్**

## వైకాపా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ రాజీనామా



**గుంటూరు:** వైకాపాకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి మర్రి రాజశేఖర్ రాజీనామా చేశారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజును కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీగా మర్రి రాజశేఖర్ పదవీకాలం 2029వరకూ ఉంది. త్వరలో ఆయన టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్సీలు వైకాపాను వీడారు. వారిలో జయమంగళ వెంకటరమణ, పోతుల సునీత, బల్లి కల్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ ఉన్నారు. చిలకలూరిపేట వైకాపా ఇన్‌ఛార్జ్‌గా మాజీ మంత్రి విడదల రజనీని నియమించడంతో మర్రి రాజశేఖర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాజీనామా చేశారు. రాజశేఖర్ రాజీనామా చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పలువురు వైకాపా నేతలు అసెంబ్లీ లాబీలో ఆయనతో మాట్లాడేందుకు యత్నించారు. రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోరారు. ఇప్పటికే తాను నిర్ణయం తీసుకున్నానని వైకాపా నేతలకు మర్రి రాజశేఖర్ తేల్చి చెప్పారు.

# ఫ్లాష్.. ఫ్లాష్..!

**- రెడ్డీస్ ఘటనలో 18 మందిపై కేసు నమోదు -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పైడిభీమవరంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీలో సెమాగ్లుటైడ్ పౌడర్ దొంగతనం జరిగిందని, దీనిపై రహస్యంగా పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారని సత్యం వెబ్‌సైట్ www.satyamdaily.net లో బుధవారం ఉదయం పోస్ట్ చేసిన కథనానికి వెంటనే స్పందన లభించింది. పరిశ్రమలో వివిధ హోదాల్లో పని చేస్తున్న 18మందిపై యాజమాన్యం ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేసినట్లు భోగట్టా. రెడ్డీస్ లేబొరేటరీలో ఈ నెల 3న స్టాక్ వెరిఫై చేయగా, మెడిసిన్ తయారీలో ఉపయోగించే 320 గ్రాముల సెమాగ్లుటైడ్ పౌడర్ కనిపించలేదని, పరిశ్రమలో పని చేసే ఉద్యోగులే దొంగిలించివుంటారని ఫిర్యాదు చేశారు. స్టాక్ రూమ్‌లోకి వెళ్లడానికి 16 మందికి మాత్రమే ప్రవేశం ఉంది. ఈ గదిని ఓపెన్ చేయాలంటే ఉద్యోగి కార్డును స్కాన్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి ఈ కార్డు యాక్సెస్ ఉన్నవారిపై మాత్రమే యాజమాన్యం ఫిర్యాదు చేసింది. కాగా స్టాక్‌రూమ్‌లో నిఘా కెమెరాలు లేవని తెలుస్తుంది.






# ప్రథమ చికిత్స చేసి.. కాపాడండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజంలో ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్స నేర్చుకొని ఆపదలో ఉన్నవారి ప్రాణాన్ని కాపాడాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ 8 రోజులు శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 20 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్స శిక్షకులు, డాక్టర్ శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, కోఆర్డినేటర్ సత్యనారాయణతో ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. హైబీపీ, గుండెపోటు, సీపీఆర్ ప్రక్రియపై అవగాహన, ఆపద సమయాల్లో గాయాలు, కట్లు కట్టడం, పాముకాటు, తేలుకాటు, గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స, కరెంట్ షాక్ తగిలిన వారికి చికిత్స, రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి, ఫిట్స్ వచ్చిన వారికి ప్రథమ చికిత్స తదితర పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్‌కమిటీ సభ్యులు కళ్యాణ్, బి.చిన్మయరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది ఏవో నర్సింగరావు, మేనేజర్ గుణాకర్‌రావు, పి.చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హమ్మయ్యా.. సునీత రిటర్న్స్!

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలో వారు భూమి చుట్టూ 4576 సార్లు పరిభ్రమించి, 195 మిలియన్ కిలోమీటర్లు ప్రయాణించడం విశేషం.

**ఉద్విగ్న వాతావరణం**

ఫ్లోరిడా తీరంలో డ్రాగన్ క్యాప్సూల్ నేరుగా సముద్రంలో దిగింది. ఆ సమయంలో సర్వత్రా ఉద్విగ్న వాతావారణం అలుముకుంది. భూ వాతావరణంలోకి ప్రవేశించిన కొద్ది నిమిషాలకే డ్రాగన్ సురక్షితంగా సముద్రపు నీటిలో దిగింది. ఆ వెంటనే నాసా కంట్రోల్ రూమ్‌లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌తో పాటు నిక్ హేగ్, రష్యన్ వ్యోమగామి అలెగ్జాండర్ వ్యోమనౌక భూ కక్ష్యలోకి ప్రవేశించే సమయంలో కొద్దిసేపు కమ్యూనికేషన్ బ్లాక్ అవుట్ ఏర్పడింది. అయితే నాసా శాస్త్రవేత్తలు దాన్ని క్షణాల్లోనే పునరుద్ధరించారు. వ్యోమనౌక సముద్ర జలాల్లో దిగిన వెంటనే నాసాకు చెందిన రికవరీ టీమ్ రంగంలోకి దిగింది. అందులో నుంచి వ్యోమగాములను ప్రత్యేక పరికరాల సాయంతో సురక్షితంగా బయటికి తీసుకొచ్చింది. వారిని అక్కడి నుంచి స్పేస్ సూట్లలోనే ప్రత్యేక వాహనంలో నేరుగా హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించారు.

**ప్రత్యేక చికిత్స**

అనుకోని పరిస్థితుల్లో సుదీర్ఘకాలంపాటు అంతరిక్షంలో ఉండిపోయిన వ్యోమగాములు ఒక్కసారిగా భూ వాతావరణానికి అలవాటు పడలేరు. అదేవిధంగా ఆరోగ్యపరంగా పలు సమస్యలు ఉత్పన్నమవుతాయి. అందుకే వారిద్దరిని 45 రోజులపాటు నాసా ఆరోగ్య కేంద్రంలో ఉంచి ప్రత్యేక చికిత్సలు అందిస్తారు. భూమి మీద ఉన్నట్లు అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు. అందుకే అక్కడ ఉన్నన్నాళ్లు ఆస్ట్రోనాట్లు గాలిలో తేలుతున్నట్లే ఉన్నారు. అందువల్ల భూమి అడుగుపెట్టిన వెంటనే వ్యోమగాములు నడవలేరు. గురుత్వాకర్షణ శక్తికి శరీరం అలవాటు పడటంతోపాటు కాళ్లు నేలకు ఆనేలా నెలల తరబడి ఎక్సర్‌సైజ్‌లు చేయాల్సి ఉంటుంది. వారు సొంతంగా నడిచేంత వరకు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారు. కండరాల క్షీణతతోపాటు, ఎముకల సాంద్రత తగ్గడం, తల తిరగడం వంటి సమస్యలు ఉత్పన్నం కావచ్చు. అంతరిక్షంలో ఉన్నప్పుడు బాడీలోని ద్రవపదార్థాలు పైకి కదులుతాయి. దీనివల్ల రక్త ప్రసరణలో మార్పులు వస్తాయి. లో బీపీ, ఎముకల కదలికల్లో నొప్పి ఉండొచ్చు. కంటి చూపుతో పాటు గుండె సంబంధిత సమస్యలూ ఎదురవుతాయి. మరోవైపు ఎక్కువ రోజులు స్పేస్‌లో ఉండటం వల్ల బుచ్ విల్మోర్ కంటే సునీతా విలియమ్స్ మానసికంగా, శారీరకంగా చాలా ఒత్తిడికి గురయ్యారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఆస్ట్రోనాట్లిద్దరికి ప్రత్యేక చికిత్స అందించాల్సి ఉంటుంది. అందువల్ల కొన్ని నెలల తర్వాతే వారిద్దరూ మళ్లీ సాధారణ జీవన ప్రవంతిలోకి రాగలరు.

# రైస్‌మిల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి




(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

రైస్‌మిల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ చట్టబద్ధమైన సౌకర్యాలు అమలుచేయాలని రైస్‌మిల్లుల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. సిటు అనుబంధ రైస్ మిల్లుల వర్కర్స్ యూనియన్ జిల్లా 4వ మహాసభ కోటబొమ్మాళిలో బుధవారం జరిగింది. ముందుగా కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి సంతమైదానం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన రైస్‌మిల్లుల కార్మికుల యూనియన్ జిల్లా కన్వీనర్ హెచ్.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్ యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయకుండా తీవ్ర శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని, రైస్‌మిల్లు యాజమాన్యాలు కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐఎల్‌వో నిబంధనలు ప్రకారం బస్తా బరువు 50 కిలోలకు మించి ఉండకూడదని, కానీ 90 కిలోలు, 100 కిలోల వరకు బరువులు మోయాల్సివస్తుందని అన్నారు. బస్తా బరువు యాభై కిలోలకు మించకుండా జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్ట ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ, వీడీఏ, గ్రాట్యూటీ అమలుచేయాలని, బోనస్ ఇవ్వాలని కోరుతూ భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించాలని మహాసభలో తీర్మానించారు. ఈ మహాసభలో సిటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు, నంబూరు షణ్ముఖరావు, కె.సూరయ్య, రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.కేశవరావు, గొండు నీలన్న, బోర శ్రీను, డి.కామయ్య, కె.రామారావు, ఎస్.వీరన్న, బాడ మల్లేషు, టి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.